

## సోమశిలలో 35.970 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి 35.970 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 1100, ఉత్తరకాలువకు 175, దక్షిణకాలువకు 20 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.64,900 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా) | రూ.5,828 |
| 3శాతం జీఎస్టీతో | రూ.6,003 |
| నవర (8గ్రా) | రూ.48,024 |

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.5 /21.4

ఆదివారం గాలిలో తేమ 75 శాతం ఉంది. ఉష్ణోగ్రత తక్కువగానే ఉంది. సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు పోలీసు స్పందన రద్దు

నెల్లూరు(క్రైమ్): క్రిస్మస్ పండుగ సెలవు సందర్భంగా సోమవారం పోలీసు కవాతు మైదానంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు.

### రేపటి నుంచి పీజీ అడ్మిషన్లు

వెంకటాచలం: విక్రమ సింహపురి వర్సిటీ(వీఎస్‌యూ) కళాశాల, కావలిలోని వీఎస్‌యూ పీజీ సెంటర్‌లో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు పీజీ స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ హనుమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు అడ్మిషన్లు పొందేందుకు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్సుల, ఇతర వివరాల కోసం 94415 99597 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### రోడ్డు సేఫ్టీ శిక్షణకు డీటీసీ చందర్



సర్టిఫికెట్ అందుకుంటున్న డీటీసీ చందర్

నెల్లూరు (టౌన్): హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగిన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ రోడ్డు సేఫ్టీ శిక్షణా కార్యక్రమానికి నెల్లూరు ఉపరవాణా కమిషనర్ బీ చందర్ హాజరయ్యారు. వాహనాల ట్రాఫిక్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రోడ్డు భద్రత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశారు.

### వ్యాసరచన పోటీల్లో కేఎన్నార్ విద్యార్థి ప్రతిభ



స్వాతిశ్రీనిధిని అభినందిస్తున్న హెచ్‌ఎం విజయప్రకాష్

నెల్లూరు (టౌన్): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వాతిశ్రీనిధి తృతీయ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా స్వాతిశ్రీనిధిని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్ విజయప్రకాష్ అభినందించారు.

### అట్టహాసంగా జాతీయ చెస్ పోటీలు ప్రారంభం



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర చెస్ అసోసియేషన్, డాట్స్ లింకప్ సంయుక్త ఆధ్వర్యంలో రంగనాయకులపేటలోని ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఏపీసీపీ సెక్రటరీ కప్ ఆలిండియా చెస్ క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై సుమన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్‌ఎల్ చెస్ అకాడమీ, ఎస్పీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆ సంస్థ చైర్మన్ పెంచలభాస్కర్, లయన్స్ ప్రైడ్ క్లబ్ అధ్యక్షుడు కార్తీక్ తొలి ఎత్తులు వేసి ప్రారంభించారు. జాతీయస్థాయిలో జరుగుతున్న అగ్రశ్రేణి ఫిడే రేటింగ్ క్రీడాకారులతో సహా 214 మంది పోటీల్లో పాల్గొన్నారు. టోర్నీ చీఫ్ ఆర్బిటర్‌గా ఎం గోపినాథ్ (గుంటూరు) వ్యవహరించారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ సత్యనారాయణ, కార్యదర్శి వై సుమన్, సంయుక్త కార్యదర్శి ఆనీస్‌దర్బారి, టోర్నమెంట్ నిర్వాహకులు మునగ సుమన్, రామ్‌లక్ష్మణ్, వంశీకృష్ణ, నర్రా విజయ్, సుధశ్రీ తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీప కాంతుల్లో నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్



ఏబీఎం కాంపౌండ్‌లోని లోన్‌స్టార్ తెలుగు బాప్టిస్ట్ చర్చి



క్రిస్మస్‌కు ముస్తాబైన నెల్లూరు సంతపేటలోని సెయింట్ జోసెఫ్ క్యాథడ్రిల్ చర్చి

## క్రిస్మస్‌కు ముస్తాబు

జిల్లాలో క్రిస్మస్ శోభ నెలకొంది. సోమవారం లోక రక్షకుడు, కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం రాత్రి నుంచే క్రీస్తు జననాన్ని ఆహ్వానిస్తూ చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

# నకిలీలకు చెక్

**అన్నదాతల సేవలో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు**

- ఉచితంగా నాణ్యత నిర్ధారణ పరీక్షలు
- నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు చెక్
- జిల్లాలో అందుబాటులోకి వచ్చిన ఐదు ల్యాబ్‌లు
- ఉదయగిరిలో నిర్మాణ దశలో మరొకటి
- ఇప్పటి వరకు 2,547 పరీక్షలు



వ్యవసాయంలో లాభాల సంగతి దేవుడెరుగు కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో రాదోననే నమ్మకాన్ని రైతులు కోల్పోయిన దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి వ్యవసాయానికి భరోసా కల్పించారు. రైతులు సాగు చేసే పంటకు ప్రాథమిక వనరులైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నాణ్యమైన వాటిని అందించాలనే ఉద్దేశంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.



ల్యాబ్‌లో పరీక్షల కోసం సిద్ధం చేసిన మెషీన్లు

కోవూరు: విత్తనం మంచిదైతే పంట బాగుంటుంది. నాణ్యమైన ఎరువులు వాడితే పంట కళకళలాడి దిగుబడి దిగులుండదు. దిగుబడి, ధరలూ బాగుంటే అన్నదాతలు సంతోషంగా ఉంటారు. నకిలీ విత్తనాలను తెలియక సాగు చేసి మొలకెత్తక నష్టపోయిన రైతులు ఉన్నారు. మొలకెత్తినా పంట చేతికందే దశలో పూత రాక, దిగుబడి రాక పెట్టుబడి నేలపాలైన విషయాన్ని గ్రహించి ఆవేదనతో గుండెలు ఆగిన రైతులు ఎంతో మంది ఉన్నారు. విత్తనాలు మంచివి విత్తినా తెగుళ్ల నివారణకు తెలియక నకిలీ మందులు వాడడంతో పంట నాశనమై నష్టాలను చవిచూసిన రైతులు ఉన్నారు.

**రైతులకు అందుబాటులోనే నాణ్యతా పరీక్షలు**

గతంలో రైతులు సాగు చేసే పంటలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను తెలుసుకోవాలంటే నమూనాలు సేకరించిన వ్యవసాయాధికారులు వాటిని రాష్ట్రంలోని సుదీర్ఘ ప్రాంతాలకు పంపించి అక్కడ ఉన్న ల్యాబ్‌ల్లో పరీక్షించే వారు. వాటి నివేదికలు వచ్చే సరికి వ్యవసాయ సీజన్ కాస్త ముగిసిపోయేది. ప్రస్తుతం ప్రభుత్వం నాణ్యత నిర్ధారణ పరీక్షల్లో జాప్యం లేకుండా ఎక్కడికక్కడే నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. రైతులకు విత్తనాలు, పురుగు మందులు ఎరువుల నాణ్యతపై అనుమానం వచ్చిన వెంటనే సమీపంలోని ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుని ఆ తర్వాత వాటి నాణ్యతను బట్టి నమ్మకంగా సాగు చేసుకునే అవకాశం కల్పించింది. వ్యవసాయాధికారులు సైతం కొన్ని నమూనాలను పరిశీలించి డీకోడింగ్‌కు పంపించాల్సి ఉంటుంది. గతంలో సుదూర ప్రాంతాలకు పంపించడం వలన ఫలితాలు రావడంలో జాప్యం జరుగుతుండేది. ప్రస్తుతం వ్యవసాయాధికారులు సేకరించిన నమూనాలను జిల్లాలోని టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపించి వాటి నాణ్యత ప్రమాణాల నివేదికలను సకాలంలో సేకరిస్తున్నారు.

**ఎలాంటి పరీక్షలు చేస్తారంటే..**

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో అన్ని రకాల పంటలు సాగుచేసే రైతులు దాదాపు లక్ష మందికి పైగా ఉన్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. జిల్లాలో ఎక్కువగా సాగు చేసే వరి, మినుము, పెసర, అలసంద, కంది, వేరుశనగ వంటి విత్తనాలను ప్రభుత్వమే రాయితీపై రైతులకు అందజేస్తోంది. మొలకశాతాన్ని పరీక్షించి నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తోంది. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు కాకుండా ఇతర రకాలు, అదనంగా విత్తనాలు అవసరమైన రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేస్తుంటారు. వాటిని అగ్రి ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకోవచ్చు. పంటలకు వినియోగించే ఎరువులు, పురుగు మందుల నాణ్యతను సైతం ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుని తెలుసుకునే వెసులుబాటు ఉంది.



కోవూరులో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్

**జిల్లాలోని అగ్రి ల్యాబ్‌ల్లో ఇప్పటి వరకు చేసిన పరీక్షలు**



| | |
|---|---|
| కందుకూరు | 588 |
| ఆత్మకూరు | 491 |
| కావలి | 437 |
| కోవూరు | 589 |
| పాదలకూరు | 442 |
| మొత్తం | 2,547 |

**నియోజకవర్గానికో టెస్టింగ్ ల్యాబ్**

జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కోవూరు, కావలి, ఆత్మకూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఉదయగిరిలో ల్యాబ్ నిర్మాణ దశలో ఉంది. ఈ ల్యాబ్‌ల్లో రైతులు వితనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను తెలుసుకునేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో ప్రారంభమైన ల్యాబ్‌ల్లో 2,547 పరీక్షలు చేశారు. డీలర్లు, ప్రైవేట్ కంపెనీల వారు మాత్రం టెస్టింగ్ సమయంలో వాటి పరిమాణాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.3 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

**రైతులకు ఉచితంగా పరీక్షలు**



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించేందుకు ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో ఐదు ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో రైతులు మోసపోకుండా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల్లో నాణ్యతా పరీక్షలు చేయించుకుని తెలుసుకోవచ్చు.
– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

## జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కమిటీ అధ్యక్షుడిగా విజయశంకర్‌రెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు: జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వై విజయశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఐ రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆత్మకూరులోని ఎస్ఆర్‌జేడీ కళాశాలలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా క్రాంతి నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, డీ రవీంద్రనాథ్, పీ మునికుమార్, మల్లిక శ్రీనివాసులు, బీ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పీడీలు సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, చంద్రశేఖర్, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎన్జీఓ జెడ్పీ యూనిట్ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(పొగతోట): ఏపీఎన్జీఓ జిల్లా పరిషత్ కార్యాలయ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఏ శైలజ, లక్కాకుల పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఏపీఎన్జీఓ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఈదూరు విజయ్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. యూనిట్ అసోసియేట్ అధ్యక్షుడిగా ఎల్ వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బీవీ రమేష్‌బాబు, కోశాధికారిగా డీ పావని, సంయుక్త కార్యదర్శిగా ఎం లీల, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌కే షాకీర్‌అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనిట్ కౌన్సిలర్లుగా ఏ అనిల్‌కుమార్, ఎస్‌కే సిరాజ్, ఎస్ రమేష్‌కుమార్, ఎస్ కార్తీక్ ఎన్నికయ్యారు.

# ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న సీఎం జగన్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: 'సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు పూర్తి న్యాయం చేశారు. చంద్రబాబులాగా ప్రజలను మోసం చేయకుండా, చెప్పిన వాగ్దానాలు అన్నింటిని నూటికి నూరుశాతం అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తిక్కవరప్పాడు పంచాయతీకి చెందిన మాజీ ఎంపీటీసీ దార్ల ఏడుకొండలుతో పాటు 40 కుటుంబాల వారు టీడీపీని వీడి మంత్రి కాకాణి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పార్టీల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు సైతం చేస్తున్నారని వివరించారు. అందుకే మరోసారి ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ మద్దతుదారులు సైతం వైఎస్సార్‌సీపీలోకి వలసలు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు సార్లు ఓటమిపాలైన సోమిరెడ్డి పోటీ చేసినా లేక చంద్రబాబు, పవన్ కల్యాణ్ పోటీ చేసినా వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌నాయుడు, మందల పెంచలయ్య, వెంకటేశ్వర్లునాయుడు, శ్రీనివాసులునాయుడు, రంగయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొడవలూరు తహసీల్దార్‌కు నోటీసులు

కొడవలూరు: మండల తహసీల్దార్ రమాదేవికి సీసీఎల్‌ఏ కార్యదర్శి(మంగళగిరి) జీ సాయిప్రసాద్(ఐఏఎస్) నోటీసులు జారీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రైతులకు సాదా బైనామా కింద పాసు బుక్‌లు ఇవ్వడాన్ని తప్పుబడుతూ ఈ నోటీసులు జారీ చేశారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన రూ.6.87 లక్షలు జమ కాలేదని, పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

# ఆడుదాం ఆంధ్రాతో క్రీడలకు ప్రోత్సాహం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- ఉత్సాహంగా మారథాన్ వాక్




నెల్లూరులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మారథాన్ వాక్ నిర్వహిస్తున్న యువత

నెల్లూరురూరల్: రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడం, యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంఘీభావంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం మారథాన్ వాక్‌ను నిర్వహించారు. నగరంలోని సర్వోదయ కళాశాల నుంచి వీఆర్సీ సెంటర్ వరకు సాగిన మారథాన్ వాక్‌లో యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత సర్వోదయ కళాశాల వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి ఎంపీ ఆదాల జెండా ఊపి మారథాన్ వాక్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆడుదాం ఆంధ్రా ద్వారా యువత క్రీడా నైపుణ్యాన్ని చాటాలన్నారు. ఈ కార్యక్రమంపై ఇప్పటికే క్రీడాకారులకు పెద్దఎత్తున అవగాహన కల్పించామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ క్రీడలను మరింత ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ యువతలో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపే అలవాటుతో పాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సీఎం వైఎస్ జగన్ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నగర మేయర్ స్రవంతి, నుడా చైర్మన్ ద్వారకానాథ్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మారథాన్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

## క్లుప్తంగా

### ప్రేమానురాగాలు పంచేది క్రిస్మస్

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట) : ప్రతిఒక్కరికీ ప్రేమానురాగాలు పంచేది క్రిస్మస్ అని, ఏసు ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా ప్రజలకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తమ బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియజేశారన్నారు. క్రైస్తవులందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

### జీసస్ దయ అందరిపై ఉండాలి

• ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట) : కరుణామయుడు జీసస్ దయ ప్రజలందరిపై ఉండాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. క్రిస్మస్ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంతోషకరమైన ఈ పర్వదినం నాడు ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలని ఆయన కాంక్షించారు. క్రీస్తు జన్మించి దాదాపు రెండు వేల సంవత్సరాలు గడిచినా ఆయన చూపిన కృప, దయ ఇప్పటికీ నిలిచి ఉన్నాయన్నారు. ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన ఏసు అందరికీ ఆదర్శమన్నారు. అభాగ్యులపై క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, శాంతి ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన కోరారు.

### సత్యమార్గంలో నడవాలి

• కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు(దర్గామిట్ట) : ఏసుక్రీస్తు చూపిన సత్య మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు మానవాళి శాంతి సంతోషాల కోసం కరుణ, ప్రేమను అందరికీ పంచారన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి వ్యక్తి అనుసరించాలన్నారు.

### ఏసు మార్గం ఆచరణీయం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



నెల్లూరు(క్రైమ్) : ప్రపంచానికి శాంతిని ప్రబోధించిన ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయమని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా చర్చిల వద్ద, ప్రధాన కూడళ్లల్లో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరూ శాంతి సామరస్యాలతో ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ జరుపుకోవాలని సూచించారు.

### బస్సు నుంచి జారిపడి వ్యక్తి మృతి



పెదబాదుల్లా మృతదేహం

కలిగిరి : కలిగిరిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆర్టీసీ బస్సు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వెలగపాడుకు చెందిన షేక్ పెదబాదుల్లా (45) కావలిలో నివాసం ఉంటున్నాడు. చిన్నచిన్న పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వెలగపాడులో తల్లి వద్దకు వెళ్లడానికి కలిగిరి బస్టాండ్‌లో నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కాడు. వెలగపాడుకు టికెట్ తీసుకుని డోర్ వద్ద సీట్‌లో కూర్చోవడానికి వెళ్తున్న క్రమంలో పెట్రోల్ బంక్ మలుపు వద్ద ప్రమాదవశాత్తు బస్సు నుంచి జారిపడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏఎస్సై సుబ్బారావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

### రైలు పట్టాలపై వృద్ధురాలి మృతి

గూడూరు రూరల్: గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వృద్ధురాలు రైలు పట్టాలపై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు విజయవాడ వైపు నుంచి చెన్నైకు వందే భారత్ రైలు వెళ్లిన కొద్ది సేపటికి పట్టాలపై పడి మృతి చెందింది. ఈ మృతదేహాన్ని పరిశీలించిన రైల్వే సిబ్బంది అక్కడ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

### పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.20
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



# వన్ రిజిస్ట్రేషన్‌తో సమగ్ర సమాచారం

**ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్ల వివరాలు ఎప్పటికప్పుడు మీ మొబైల్ లేదా మెయిల్‌కు పొందేలా ఏపీపీఎస్సీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం అభ్యర్థులు లేదా విద్యార్థులు వారి పూర్తి సమాచారాన్ని http://www.psc.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంది. దీని ద్వారా నోటిఫికేషన్ల వివరాలతో పాటు సిలబస్, మాక్‌టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు, సెలక్షన్ నమూనా ప్రశ్నపత్రాలు వంటివి పొందవచ్చు.**



వెబ్‌సైట్ హోమ్ పేజీ



వన్‌టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

- ప్రభుత్వ ఉద్యోగాల వివరాలు మీ మొబైల్‌కు..
- ఏపీపీఎస్సీ ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు(మినీబైపాస్) : ప్రభుత్వ కొలువును సాధించాలనేది ప్రస్తుత యువత లక్ష్యం. దీనిపై పూర్తి సమాచారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటోంది. ఇందులో దరఖాస్తు చేయడంలో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా నోటిఫికేషన్లకు సంబంధించిన సమగ్ర సమాచారం కోసం ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేసింది. అభ్యర్థులు ఒకసారి తమ వివరాలు నమోదు చేసుకుంటే సరిపోతుంది. వివిధ నోటిఫికేషన్లకు సంబంధించి దరఖాస్తు చేసే సమయంలో ప్రతిసారి తమ వివరాలు వెబ్‌సైట్‌ల్లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. ఆధార్ అనుసంధానంతో దరఖాస్తుదారుడి వివరాలు వెబ్‌సైట్‌లో భద్రపరిచి ఉంటాయి.

**రిజిస్ట్రేషన్ ఇలా..**

వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తరువాత వన్‌టైం ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) పై క్లిక్ చేయాలి. దీనిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ టెస్ట్ అనే రెండు విభాగాలు కనిపిస్తాయి. వీటిలో డైరెక్టర్ రిక్రూట్‌మెంట్‌ను ఎంపిక చేసుకోవాలి. దీనిపై క్లిక్ చేయగానే న్యూ రిజిస్ట్రేషన్, మాడిఫై రిజిస్ట్రేషన్, కన్ఫర్మ్ రిజిస్ట్రేషన్ అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. దీనిలో న్యూ రిజిస్ట్రేషన్ క్లిక్ చేయాలి.

• రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ఓటీపీఆర్ రిఫరెన్స్ ఐడీని భద్రపరుచుకోవాలి. మొబైల్ ఫోన్, ఈ మెయిల్‌కు వచ్చే కోడ్స్‌ను దరఖాస్తుదారుడు గమనించి ధ్రువీకరించాల్సి ఉంటుంది. చివరగా దరఖాస్తుదారుడు తన రిజిస్ట్రేషన్ ప్రక్రియను కన్ఫర్మ్ చేయాల్సి ఉంటుంది.. ఈ మూడు అంశాలను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉంటుంది.

**ఇవ్వాల్సిన వివరాలు**

దరఖాస్తు పూర్తి చేసే విధానంలో మొదట ఆధార్ నంబర్‌ను ఇవ్వాలి. పదోతరగతి మార్కుల జాబితాలో పేరు, జన్మస్థలం, కులం, తల్లిదండ్రుల పేర్లు, మాతృ భాష, గుర్తింపు చిహ్నాలు(పుట్టుమచ్చలు) వంటివి నమోదు చేయాలి. పుట్టిన జిల్లా, పట్టణం, ప్రాంతాలు (వార్డు) సవివరంగా అందించాల్సి ఉంటుంది. దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, తాత్కాలిక ఉద్యోగులు, ఉద్యోగస్తులా, వయో పరిమితి కోరుతున్నారా అనే వివరాలు అందివ్వాలి. చిరునామా, ఈ మెయిల్ ఐడీ, రెగ్యులర్‌గా చదివారా, ప్రైవేటుగా చదివారా, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ ఎక్కడ చదివారు, ఏ సబ్జెక్టులు చదివారు. హాల్ టికెట్ నంబరు, సాధించిన మార్కుల శాతాలు తదితర వివరాలు ఇచ్చిన కాలమ్స్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

**వీటిని సరిచూసుకోవాలి**

దరఖాస్తు పూర్తి చేసే దశలో చివరగా ఫొటో, సంతకాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటో 3.5.సెం.మీ పొడవు, 4.5 సెం.మీ వెడల్పు ఉండే విధంగా, 50 కేబీ సైజుకు మించకుండా చూడాలి. సంతకం 3.5 సెం.మీ పొడవు, 1.5 సెం.మీ వెడల్పు ఉంటూ 30 కేబీ సైజును కలిగి ఉండాలి. ఈ రెండింటినీ జేపీఈజీ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలి.

• పరీక్ష రాయడానికి అనువైన జిల్లా, నగరాలను ఎంపిక చేసుకోవచ్చు. దీనిలో ప్రైమరీ, సెకండరీ, టెరిటరీ అనే మూడు విభాగాల్లో మూడు ప్రాంతాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. పరీక్ష కేంద్రం కేటాయింపు నిర్వహణ అధికారులపై ఉంటుంది.

• వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ వల్ల ప్రభుత్వం విడుదల చేసే వివిధ నోటిఫికేషన్లకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మనం పొందే అవకాశం కల్పిస్తున్నారు. దీని కోసం వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ అలర్ట్స్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీని సహాయంతో ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని పొందే వీలుంది. చివరగా దరఖాస్తులో నింపిన సమాచారాన్ని ఒకసారి సరిచూసుకోవాలి. పేర్కొన్న వివరాలన్నీ సరైనవని దరఖాస్తుదారుడు వాంగ్మూలం(వెల్లడి) చేయాలి. దీనిని సబ్‌మిట్ చేయడం ద్వారా ప్రక్రియ ముగుస్తుంది.

**విద్యార్థుల కోసం..**

విద్యార్థులు తమ వివరాలు పూర్తి చేసిన తరువాత తమ విద్యార్హతలు పెరిగినా, నూతన కోర్సులు పూర్తి చేసినా మాడిఫై చేసుకునే వీలు ఉంటుంది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చు. దీని కోసం ఓటీపీఆర్ రిఫరెన్స్ ఐడీ, పుట్టిన తేదీ వివరాలు అందించి మార్పు చేసుకోవచ్చు.

### భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్



కేక్ కట్ చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో ఉన్న బాప్టిస్ట్ చర్చి డానీహాల్‌లో భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్స్ జిల్లా మేనేజర్ జేఎస్ మల్లికార్జునరెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ భారతి సిమెంట్స్ తరఫున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పాస్టర్ కె.శాంసన్ కుమార్, కార్యదర్శి అరుణకుమార్, బ్రదర్ జానీజో తదితరులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిత్య అన్నదాన పథకానికి ఆదివారం తిరుపతికి చెందిన మావిళ్ల స్వతంత్ర బాబు, భార్య సునీత రూ.లక్షా 11వేల116 నగదును విరాళంగా అందించారు. దేవస్థానం ఈఓ జనార్దన్‌రెడ్డిని కలిసి విరాళాన్ని అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందించారు.

# పక్షుల కేంద్రంలో సందర్శకుల సందడి



బైనాక్యులర్స్ ద్వారా విహంగాలను వీక్షిస్తున్న సందర్శకులు



విడిది చేస్తున్న గూడబాతులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. స్థానికంగా విడిది చేస్తున్న వలస విహంగాలను వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు, పక్షి ప్రేమికులు కేంద్రానికి విచ్చేసి విహంగాలను తిలకించారు. మార్గం మధ్యలోని పార్కులో ఉన్న జింకలు, రామచిలుకలను చూస్తూ సందడి చేశారు. పర్యావరణ కేంద్రంలో విహంగాల జీవన శైలి చిత్రాలను పరిశీలించారు. చెరువు కట్టపై అటవీ సిబ్బంది, నేచర్ గైడ్‌హుస్సేన్ విహంగాల ప్రాధాన్యం, పక్షుల కేంద్రం ప్రాముఖ్యత గురించి పర్యాటలకు వివరించి అవగాహన కల్పించారు.

**పక్షి పిల్లల కేరింతలు**

పక్షుల కేంద్రంలో వివిధ రకాల వలస విహంగాలు పిల్లలను పొదిగి ఉన్నాయి. పక్షి పిల్లల కేరింతలతో కేంద్రం నిండిపోయింది. పక్షి ప్రేమికులను పక్షి పిల్లల కేరింతలు, వాటి విన్యాసాలు బాగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెడ్డుముక్కుకొంగలు, తెల్లకంకణాయిలు, నీటికాకులు కేంద్రంలో ఉన్న చెరువులోని కడప చెట్లుపై పిల్లలను పొదిగాయి. వీటిని దగ్గరగా వీక్షించే విధంగా స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద బైనాక్యులర్స్ వంటివి ఏర్పాటు చేశారు. పక్షులపై అవగాహన కల్పించే సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

# క్రికెట్ ఆడుతుండగా వివాదం

• బాలుడి మృతి



ఫరీద్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : క్రికెట్ ఆడే సమయంలో ఇద్దరు బాలురు మధ్య నెలకొన్న వివాదం ఓ బాలుడి మృతికి దారితీసింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరంలోని జాకీర్‌హుస్సేనగర్‌కు చెందిన ఫరీద్(14), అదే ప్రాంతానికి చెందిన ఓ బాలుడు స్నేహితులు. ఇద్దరు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఫరీద్ ప్రవర్తన సరిగ్గాలేని విషయాన్ని గమనించిన ఆ బాలుడు స్నేహితుని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో స్నేహితుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. చీటికి మాటికి అరుచుకునేవారు. ఈ నేపథ్యంలో వారు ఆదివారం సత్యనారాయణపురంలోని ఓ పాఠశాల సమీపంలో ఉన్న క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుకుంటుండగా మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఫరీద్ దూషించడాన్ని జీర్ణించుకోలేని స్నేహితుడు అతనిపై దాడిచేశాడు. దీంతో ఫరీద్ ఫిట్స్ వచ్చి అక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న బాలుడి కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న ఫరీద్‌ను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి వాజిద్ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కోనలో వైభవంగా హనుమద్‌వ్రతం



క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఆదివారం హనుమద్ వ్రతాన్ని పురస్కరించుకుని ఆయజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెంచలకోన క్షేత్రంలో శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామికి అభిముఖంగా ఉన్న క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి మూలమూర్తికి పాలు, తేనె, పెరుగు, పంచామృతాలతో అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. తిరుచ్చిపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాలు ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలతో కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి వెయ్యినామాలతో ఆకుపూజ నిర్వహించారు. మాలాధారణ భక్తులు దీక్ష విరమించారు. ఉభయకర్తగా మధుసూదన రావు వ్యవహరించారు. కోనలోని భక్తులు క్షేత్రోత్సవంలో స్వామివారికి టెంకాయ కర్పూరం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, నాగరాజస్వామి, మల్లికార్జున స్వామి, ప్రసాద్ స్వామి పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ప్రారంభం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, వరప్రసాద్



పరుగు పందెం పోటీలు




షాట్‌పుట్‌లో బహుమతులు సాధించిన ప్రకాశం క్రీడాకారులు



మహిళల లాంగ్‌జంప్‌లో పతకం సాధించిన కృష్ణాజిల్లా క్రీడాకారిణి

ఉలవపాడు : రాష్ట్రస్థాయి 43వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు రామాయపట్నం చర్చి గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కార్యదర్శి వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని 13 జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. షాట్‌పుట్‌లో 45 ఏళ్ల విభాగంలో మొదటి బహుమతి జీవన్‌కుమార్ (ప్రకాశం), రెండో స్థానం మురళి (ప్రకాశం), మూడో స్థానం ఆర్‌వీఎస్ రాజు(విశాఖపట్నం) నిలిచారు. మహిళల విభాగంలో వింధ్య (కృష్ణాజిల్లా) మొదటి స్థానం సాధించింది. 85 ఏళ్ల లాంగ్‌జంప్‌లో వై.రామచంద్రయ్య (నెల్లూరు) ప్రథమస్థానం సాధించారు. లాంగ్‌జంప్ 45 ఏళ్ల భాగంలో ఎస్.రమాదేవి (నెల్లూరు) ప్రథమ స్థానంలో నిలిచారు. ముందుగా జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌కుమార్, కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.